
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కరీంనగర్
జిల్లా వార్తలు
5
మంగళవారం 22 ఏప్రిల్ 2025


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫీల్డ్ అసిస్టెంట్స్, అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పత్తం యాదగిరి మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉపాధి పనులే కాకుండా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. తమ సేవలను ప్రభుత్వాలు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేలు వర్తింపచేస్తూ, వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నజీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రిసోర్స్‌పర్సన్స్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్స్‌గా పని చేసేందుకు అర్హత గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ఏప్రిల్ 24 సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులన జిల్లా విద్యాధికారి కార్యాయంలో అందజేయాలన్నారు. అభ్యర్థులను జిల్లా స్థాయి కమిటీ ఇంటర్వ్యూ, డెమోస్టేషన్ ద్వారా ఎంపిక చేస్తుందన్నారు.

నేడు టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈతో ఫోన్ ఇన్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 వరకు ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ (ఆపరేషన్స్) మేక రమేష్‌బాబు ఓ ప్రకటనలోఓ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై 9440811444 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈలు, ఎస్ఏఈలు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

- పెరిగిన ఉష్ణోగ్రతలతో డీర్‌పార్క్‌లో విదేశీ పక్షుల విలవిల
- బోనులను నీటితో చల్లబరుస్తున్న సిబ్బంది


డీర్ పార్క్‌లో ఉన్న జంతువులు, పక్షులు

ఎండకు అల్లాడుతున్న మూగజీవాలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సూర్యుడి ప్రతాపంతో నీడ పట్టున ఉన్న మనుషులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక జంతువులు, పక్షుల సంగతి ఎలా ఉంటుంది తలుచుకోండి... అడవిలో ఉండే జంతువులు ఏ వాగులోనే... చెరువులోనే ఈత కొడుతూ ఎండతీవ్రతకు గురి కాకుండా ఏ చెట్ల పొదల్లోనో, వృక్షాల కిందనో నీడపట్టున ఉండి తమకు తాము రక్షించుకుంటాయి. కరీంనగర్‌లోని డీర్ పార్క్‌లో కేజ్‌లలో ఉన్న జంతువులు, పక్షులు ఇబ్బంది పడుతున్నాయి. డీర్‌పార్క్‌లో చెట్లు అంతంత మాత్రంగానే ఉండడం, రేకులతో ఏర్పాటు చేసి షెడ్లలో ఎండ, వేడిగాలులతో జంతువులు, పక్షులు సతమతమవుతున్నాయి.

● రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

కొద్ది రోజులుగా కరీంనగర్‌లో 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు ఇళ్లను వదిలి బయటకు రావడం లేదు. పగటి పూట వీస్తున్న వేడిగాలులు, తీవ్రమైన ఎండలకు డీర్‌పార్క్‌లోని జింకలు, వివిధ రకాల పక్షులు విలవిలలాడుతున్నాయి. దీంతో డీర్‌పార్క్ ఇన్‌చార్జి, ఫారెస్ట్ డిప్యూటీ రేంజి ఆఫీసర్ ఆనంద్‌కుమార్ పర్యవేక్షణలో బీట్ ఆఫీసర్లు నరేష్, స్వాతి, సిబ్బంది రంగంలోకి దిగి ఎండ తీవ్రత నుంచి జంతువులు, పక్షులను రక్షించేందుకు చర్యలు చేపట్టారు. పక్షులతోపాటుగా జింకలు వేడిని తట్టుకోలేక ఆహారాన్ని తక్కువగా తీసుకోవడాన్ని గ్రహించిన డీర్‌పార్క్ సిబ్బంది ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేసి ఎండల నుంచి పక్షులను, జంతువులను రక్షించడానికి చర్యలు చేపట్టారు. జింకలు, సాంబారు, నీల్‌గాయి,

(మిగతా 8వ పేజీలో)

● కరీంనగర్ డీర్‌పార్క్‌లో మొత్తం 280 వరకు పక్షులు, జంతువులు ఉన్నాయి. ఇందులో 80 వరకు జింకలున్నాయి. 30 పావురాలు, 30 హంసలు, 30 హామ్‌స్టర్లు, 30 కుందేళ్లు, మూడు తాబేళ్లు, ఇతర పక్షులు, జంతువులు ఉన్నాయి. కరీంనగర్ శివారులో మానేరు జలాశయం దిగువన బైపాస్ రోడ్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న డీర్‌పార్క్‌కు మరిన్ని జంతువులు, పక్షులు తరలించాలని, పార్క్‌లో పిల్లల ఆట వస్తువులు, సౌకర్యాలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని నగరవాసులు కోరుతున్నారు.


పక్షులకు నీరు పడుతున్న డీర్ పార్క్ సిబ్బంది

అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిన పార్టీ కాంగ్రెస్

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించింది కాంగ్రెస్ పార్టీ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. సోమవారం నగరంలోని శుభమంగళ గార్డెన్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తు ఆయన అడుగు జాడల్లో నడుస్తున్న ఏకైన పార్టీ బీజేపీ మాత్రమే అన్నారు. అంబేద్కర్ అందరికీ దేవుడిలాంటివారని, ఆయనను దళితులకే పరిమితం చేయడం సరికాదన్నారు. అంబేద్కర్‌ను దళిత జాతికే పరిమితం చేయాలని కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. అవమానాలను అధిగమించి అనుకున్న లక్ష్యాన్ని చేరిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. భారత రత్న ఇవ్వకుండా ఆయనను ఎన్నికల్లో ఓడించిన దుర్మార్గమైన పార్టీ కాంగ్రెస్ అన్నారు. అంబేద్కర్ చరిత్రను కనుమరుగు చేసేందుకు కుట్రలు చేశాన్నారు. అంబేద్కర్ చరిత్రను ప్రజలకు తెలియజేసేందుకు సామాజిక సమరత దినోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రిజర్వేషన్లను ప్రతిపాదిస్తే రిజర్వేషన్లు సరికాదని నెహ్రూ అన్నాడన్నారు. విద్యా ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే మండల్ కమిషన్ సిఫారసులను ఆమోదించకుండా బీసీలను అవమానించిందన్నారు. ఆర్టికల్ 370 దేశానికి మంచిదికాదని, ఒకే దేశానికి రెండు చట్టాలు కరెక్ట్ కాదని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకిస్తే ఆయనను అవమానిస్తూ ఆ ఆర్టికల్‌ను కాంగ్రెస్ ఆమోదించిదన్నారు. హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెడితే అడ్డు తగిలి అవమానించిందన్నారు. కాంగ్రెస్ తీరును వ్యతిరేకించి రాజీనామా చేసి బయటకు వచ్చి ఎన్నికల్లో పోటీ చేస్తే కమ్యునిస్టులతో కలిసి రెండు సార్లు అంబేద్కర్‌ను ఓడించిందన్నారు. డూప్లికేట్ గాంధీ కుటుంబ సభ్యులైన నెహ్రూ, ఇందిరా, రాజీవ్‌గాంధీలకు భారతరత్న ఇచ్చుకుందన్నారు. అంబేద్కర్‌కు ఇవ్వకుండా ఆయనను ఎన్నికల్లో ఓడించిన వ్యక్తికి పద్మభూషణ్ అవార్డు ఇచ్చి తీవ్రమైన మానసిక క్షోభకు గురి చేసిందన్నారు. దళితుడిగా పుట్టడమే పాపమైందనే బాధతో బౌద్ధమతాన్ని స్వీకరించేలా చేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. రిజర్వేషన్లు మన సమాజాన్ని అస్తవ్యస్తం చేస్తాయని చెప్పడమే కాకుండా లోక్ సభలో ఈ రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ తిరస్కరించారన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ ముస్లిం లకు మతపరమైన రిజర్వేషన్లు కల్పించేందుకు కు ట్రలు చేసిందన్నారు. మైనా ర్టీల సంతృప్తి పరిచేందుకు మైనార్టీ విద్యా సంస్థలకు అనేక మినహాయింపులిచ్చిందన్నారు. బీజేపీ పాలనలో అంబేద్కర్‌కు భారత రత్న అవార్డు అందించామన్నారు. అంబేద్కర్ జయంతిని రాష్ట్రీయ సమరసత దినంగా ప్రకటించి 120 దేశాల్లో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పంచతీర్థాలను అభివృద్ధి చేశామన్నారు. సుప్రీం కోర్టు న్యాయ మంత్రిత్వ శాఖలో విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించామన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు నారీ శక్తి వందన్ బిల్లును ప్రవేశపెట్టామన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేశామన్నారు. ఎన్‌సీబీసీ (జాతీయ బీసీ కమిషన్)కి రాజ్యాంగ బద్ధత కల్పించామన్నారు. దళిత, ఆదివాసీలను రాష్ట్రపతిగా చేసిన ఘనత బీజేపీదే అన్నారు. 12 మంది దళితులకు, 27 మంది ఓబీసీలకు, ఎనిమిది మంది మహిళలకు కేబినెట్‌లో చోటు కల్పించామన్నారు. ఏటా 1.25 లక్షల మంది దళితులను పారిశ్రామిక వేత్తలుగా మారుస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, మానేరు అనంతరెడ్డి, దేవేందర్ రావు, అడవి కుమార్, డాక్టర్ గంగాధర్, రాజేందర్ రెడ్డి, సోమిడి వేణు పాల్గొన్నారు.


కరీంనగర్‌లో నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భూ భారతితో పెండింగ్ సమస్యల పరిష్కారం

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూ భారతి చట్టంతో పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర మండల కేంద్రంలో భూ భారతి కొత్త ఆర్వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఏ తప్పు చేయకుండానే రైతులను, అధికారులను దోషులుగా నిలబెట్టిందన్నారు. ధరణి లోపాలు రైతులు, అధికారుల మధ్య గొడవలు సృష్టించి రైతులు ఆత్మహత్యలకు ఉసిగొల్పాయని అన్నారు. మేధావులు, రాజకీయ నాయకులు, రైతు సంఘాల నాయకులు, అధికారులతో చర్చించి మెరుగైన ఆర్వోఆర్ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పరిధిలో భూములకు త్వరలోనే పరిహారం అందుతుందని తెలిపారు. రైతులు, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

● సరైన మార్గదర్శకాలు లేక పేరుకు పోయిన భూ సమస్యలు

- కలెక్టర్ పమేలా సత్పతి

ధరణి వ్యవస్థలో సరైన మార్గదర్శకాలు లేక పొరపాట్ల సవరణకు కలెక్టర్‌కు మినహా ఏ అధికారికి అవకాశం లేదని, దీంతో వేల సంఖ్యలో సమస్యలు పేరుకుపోయాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తాను విధుల్లో చేరే సమయానికి 11 వేల భూసమస్యల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆరు నెలల క్రితం ప్రభుత్వం అధికారాలను విభజించడం తో దరఖాస్తులను వేగంగా పరిష్కరించామని, ప్రస్తుతం 2300 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. భూ భారతి చట్టంలో ప్రభుత్వం భూ సమస్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా పొరపాట్ల సవరణకు, అప్పీల్ చేసుకుని సమస్య పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. భూముల వివరాలు ప్రతి సంవత్సరం డిసెంబరులో వెల్లడవుతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి, ఏడీఏ ప్రియదర్శిని, ఏవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జాగిరపు రజిత, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, ఉపాధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, హాజరైన రైతులు, ప్రజలు

● ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కురిక్యాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఆమె ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న ఆవుదుర్తి కళ్యాణి, ఆవుదుర్తి కళతో కలెక్టర్ మాట్లాడారు. ఏదైన సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రెండో విడత లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని, అత్యంత పేదలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం గర్షకుర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో కార్మికశాఖకు మంత్రే లేడన్నారు. భవన నిర్మాణ కార్మికులకు చెందాల్సిన నిధు లు పక్కదారి పడుతున్నాయన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఉ పాధ్యక్షుడు పప్పుల సురేష్, ప్రదీప్, రాష్ట్ర కా ర్యవర్గ సభ్యుడు పసుల శ్రావణ్, తోర్తి శ్రీని వాస్,మొగిలిపాలెంతిరుపతి, సత్యం పాల్గొన్నారు.

దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యత

- భూమిపై ఆధిపత్యం కోసం మనిషి విచక్షణరహిత పనులు
- జిల్లాలో అంతరించిపోతున్న అడవులు, గుట్టలు....
- నేడు ధరిత్రి దినోత్సవం



7

హేయ్.. చాట్‌జీపీటీ ఈ సమస్యను పరిష్కరించు..

7

విద్యుత్ మీటర్ పొందండిలా..

6

రూ. 7,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,650 రూపాయలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఆరుగురు రైతులు 74 క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వార గరిష్ఠ ధర 7,650, కనిష్ఠ ధర 5,500 చెల్లించి కొన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ (టిఓఎస్ఎస్) పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రెండో రోజు ఉదయం 92 శాతం, మధ్యాహ్నం 83.87 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మూడు ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాల్లో 410 విద్యార్థులకు 375 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇంటర్ పరీక్షా నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 908 మంది విద్యార్థులకు 839 మంది హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనఖీ చేశామన్నారు. జిల్లాలో ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహించామని ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు తెలిపారు.

రోడ్లను పట్టించుకోరా..?

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిని ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. నగరంలోని రద్దీగా ఉండే ప్రాంతమైన తెలంగాణ చౌక్‌లో రోడ్డును తవ్వి పని పూర్తయిన తర్వాత నామమాత్రంగా పూడ్చి వేశారు. కనీసం ప్యాచ్‌వర్క్ చేయలేదు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద పెద్ద గుంత తీసి అలాగే వదిలిపెట్టారు. రోజు పెద్ద సంఖ్యలో వాహనాలు తిరిగే ఈ ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్



ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నడిరోడ్డుపై తవ్విన గుంత



తెలంగాణ చౌక్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

పట్టణ చెరువులకు మహర్దశ

- మున్సిపాలిటీ చెరువుల సుందరీకరణకు నిధులు మంజూరు
- అమృత్ 2.0 పథకం కింద ప్రజారోగ్య, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పనులు
- మూడు ప్యాకేజీల్లో పనులు
- టెండర్ల నిర్వహణకు కసరత్తు


సుందరీకరణ కానున్న జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోతె చెరువు

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధమైన నీటి వనరులకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా చెరువుల పరిరక్షణ, అభివృద్ధి, సుందరీకరణ పనులపై కేంద్ర, రాష్ట్రాలు దృష్టి సారించాయి. రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో ఉన్న చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాయి. ఇందుకు అమృత్ పథకం 2.0 కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో చెరువులను సుందరీకరణ చేయడానికి శ్రీకారం చుట్టాయి. ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వ ర్యంలో పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబం ధించి డీపీఆర్ (డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్)కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయి. ఎంపికైన చెరువులన్నింటికి పనులు చేపట్టడానికి కసరత్తులు చేస్తోంది. మంజూరైన నిధులతో చెరు వు కట్టల బలోపేతం, పూడికతీత, చెత్తా చెదారం తొలగింపు, మురుగు నీరు చేరకుండా ఏర్పాట్లు చేయనున్నారు.

● చెరువులకు ఊపిరి...

మున్సిపాలిటీల్లో గల పలు చెరువులు జీవకళను కోల్పోతున్నాయి. అలాంటి చెరువుల్లో పూడిక తీత, గుర్రపు డెక్క పెరిగి మురుగు కాలువల నుంచి వచ్చే నీటితో చెరువు పరిసరాలు కంపు కొడుతున్నాయి. ఫలితంగా పట్టణప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందుకు అమృత్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుందరీకరణ జరపడానికి ముందుకు వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం మేరకు చెరువుల సుందరీకరణ పూర్తయితే పట్టణ ప్రాంతాల్లో గల చెరువులు కొత్త కళను సంతరించుకోనున్నాయి.

● 142 చెరువుల అభివృద్ధి...

రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీల్లో గల 142 చెరువులను రూ. 380.11 కోట్ల నిధులతో సుందరీకరణ జరపడానికి నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 162.43 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 183.12 కోట్లు, సంబంధిత మున్సిపాలిటీ వాటా రూ. 34.56 కోట్లుగా నిర్ణయించారు. కాగా మొదటి ప్యాకేజీ కింద ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గల 45 మున్సిపాలిటీల్లో 50 చెరువులను రూ. 132.45 కోట్లతో, రెండో ప్యాకేజీలో నల్లొండ మున్సిపల్ డివిజన్‌లోని 17 మున్సిపా లిటీల్లో 20 చెరువులను రూ. 54.73 కోట్లతో, మూడో ప్యాకేజీలో మహబూబ్‌నగర్, నిజామాబాద్, సంగారెడ్డి మున్సిపల్ డివిజన్‌లోని 68 మున్సిపా లిటీల్లో 72 చెరువులను రూ. 192.93 కోట్లతో సుందరీకరణ చేయడానికి నిధులు మంజూరు అయ్యాయి.

● టెండర్ల దశలో పనులు...

చెరువుల సుందరీకరణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. మొదటిసారి నిర్వహించిన టెండర్లకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండో సారి టెండర్లను ప్రభుత్వం పిలిచింది. మొదటిసారి టెండర్లను 2025 జనవరి 29వ తేదీన పిలవగా 2025 ఫిబ్రవరి 13వ తేదీ వరకు గడువు విధించారు. గడువు ముగిసినప్పటికీ టెండర్లకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. దీంతో 2025 మార్చి 26వ తేదీన రెండోసారి టెండర్లను పిలిచారు. ఏప్రిల్ 16వ తేదీ నాటికి తుది గడువు విధించింది. అయితే ఇంకా సంబంధిత టెండర్లను తెరవలేదు. టెండర్లను పూర్తి చేసే పనులను అధికారులు నిర్వహిస్తున్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో టెండర్లను తెరిచి మిగిలిన కసరత్తులు నిర్వహించ డానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.


జగిత్యాల జిల్లా తాళ్ల చెరువు

చెరువుల పునర్జీవానికి నిధులు మంజూరు

-సంపత్‌రావు, ఈఈ,
ప్రజారోగ్య శాఖ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

చెరువుల పునర్జీవం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. సంబంధిత నిధులతో పనులు పూర్తి చేయడానికి టెండర్లను ఆహ్వానించగా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇటీవల రెండోసారి టెండర్లను పిలిచారు. టెండర్లు దాఖలు చేయడానికి గడువు ముగిసింది. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసే పనులను నిర్వహిస్తున్నాము. ఈ నిధులతో పనులు పూర్తయితే పట్టణ చెరువులు కొత్త అందాలతో మెరుస్తాయి.

విద్యుత్ మీటర్ పొందండిలా..



గణేశ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారు విద్యుత్తు మీటరు పొందడం, పేరు మార్పిడి గురించి అవగాహన లేక ఇబ్బంది పడుతుంటారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. మీటరు కావాల్సిన వారు నేరుగా మీ-సేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ శాఖ సూచించిన రుసుము చెల్లించి మీటరు తీసుకోవచ్చు.

● దరఖాస్తుతోపాటు జత చేయాల్సిన పత్రాలు:

- ఇంటి యజమాని ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు
- స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ దస్తావేజు పత్రాల జిరాక్స్, మున్సిపాల్టీ, గ్రామ పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతి పత్రాలు
- కిలోవాట్‌కు కేటగిరీ-1 అయితే పట్టణం, నగర వాసులు 1,470, గ్రామీణ ప్రాంత వాసులు1,570, కేటగిరీ-2 అయితే పట్టణాలు, నగరంలో 2,495, గామీణ ప్రాంతాల్లో 2,095 రూపాయలు చెల్లించాలి.
- పేరు మార్పిడికి స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ దస్తావేజు జిరాక్స్ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు.
- బాండ్ పేపర్‌కు 100, ఇతర చార్జీలకు 195 రూపాయలు చెల్లించాలి.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ

● ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు


ఆటోలోనే మృతిచెందిన నాగరాజు

వీణవంక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు ఐలాబాద్ గ్రామలమధ్య ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనగా.. ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల వివరాలప్రకారం.. కరీంనగర్ కట్టరాంపూర్ చెందిన కర్నాల నాగరాజు తన ఆటో (ఎపి15టిసి 5802)లో వీణవంక నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్నాడు. అదేసమయంలో మర్రి రమేష్, మల్లేష్ ద్విచక్రవాహనం(ఎపి29బిఎల్0382)పై వీణవంకకు వస్తున్నారు. బైక్‌పై వేగంగా వస్తున్న రమేష్ ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటోను నడుపుతున్న నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై కూర్చున్న మల్లేష్‌కు, రమేష్‌కు తీవ్రగాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుడి భార్య దేవలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జ్యోతినగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బాపూజీనగర్‌కు చెందిన పేరాల ఈశ్వర్(59) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈనెల 14న రాత్రి రామగుండంలో రైలుదిగి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో కమిషనరేట్ సమీపంలో ఆటోనుంచి కిందపడి తీవ్రంగాగాయపడ్డాడు. డ్రైవర్ ఆటోను నిర్లక్ష్యంగా నడుపుతున్న క్రమంలో డ్రైవర్ పక్కనే కూర్చుని ప్రయాణిస్తున్న ఈశ్వర్ కింద పడ్డాడు. తలకు బలమైన గాయమైన అతన్ని కరీంనగర్‌కు తర లించి చికిత్స చేయించారు. ఆరోగ్యపరిస్థితి విషమించడంతో ఈశ్వర్ ఆదివారం రాత్రి చనిపోయినట్లు ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. మృతుడి కుమారుడు హరీష్ ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ ఫజలుద్దీన్‌పై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

ముస్తాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామంలో చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందారు. కొండాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ రషీద్ (46) తన స్నేహితుడు ఎండీ బాబాతో కలిసి ఆదివారం రాత్రి పదకొండు గంటలకు గ్రామంలోని పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చెరువులో బురద గుంటలో చిక్కుకొని నీటిలో మునిగి రషీద్ మృతిచెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. రషీద్ భార్య షహనాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య


బలరాం (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బి.వై. నగర్‌కు చెందిన బూర బలరాం (55) అనే పవర్‌లూం కార్మికుడు అప్పుల బాధతో సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణంలోని బి.వై. నగర్‌కు చెందిన బూర బలరాం పవర్ లూం కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్నిపోషిస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లకు దాదాపు రూ. 3లక్షల అప్పులు అయ్యాయి. ఈ అప్పులన్నీ పొదుపు సంఘాల్లో తీసుకొని చెల్లించలేని పరిస్థితి నెలకొనడంతో భార్యతో గొడవజరిగింది. సెల్‌ఫోన్ పగులగొట్టడంతో ఆమెఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అప్పులు చెల్లించలేని స్థితిలో ఉన్న బలరాం తీవ్రమనస్థాపంతో తన ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొంతసేపటికి భార్య వచ్చి చూడడంతో అప్పటికే భర్త బలరాం మృతిచెందాడు. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారికి తెలియజేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సంఘటనా స్థలానికిటౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్‌వెళ్లి మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టంకోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కుమారుడు బూర నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు.

ఆన్‌లైన్ సెంటర్‌లే లక్ష్యం

● సైబర్ నేరాలులకు పాల్పడుతున్న ఒకరి అరెస్ట్
● ఎస్పీ మహేశ్ బి గీతే


సైబర్ నేరస్థుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేశ్ బి గీతే

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ సెంటర్‌లే లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితుడైన మహారాష్ట్రలోని భీవండికి చెందిన దాసరి మురళి(45) అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని ఎస్పీ మహేశ్ బి.గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిందితుడి అరెస్ట్ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మురళికి సహకరించిన నలుగురు నిందితులను గతంలోనే అరెస్ట్ చేశామన్నారు. దాసరి మురళిపై దేశ వ్యాప్తంగా ఎన్‌సిఆర్‌పిలో నమోదైన 38పిటిషన్‌లలో రూ. 45లక్షల మోసాలకు పాల్పడ్డాడన్నారు. భీవండికి చెందిన దాసరి మురళి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తుండగా విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడి ఎలాగైనా సులభమార్గంలో డబ్బులు సంపాదించాలని సైబర్‌నేరాలవైపు దృష్టి పెట్టాడన్నారు. తన స్నేహితులైన విలేష్ పటేల్, చిరగ్ రమేశ్, జితేంద్ర సోమాభాయ్, నిలేష్ జైసింగ్ తోకలిసి ఒక ముఠాగా ఏర్పడి దాసరి మురళి ఆన్‌లైన్ సెంటర్‌లను లక్ష్యంగా చేసుకొని నమ్మించి డబ్బులు కొట్టేయడం మొదలు పెట్టాడన్నారు. ఇదే విధంగా జిల్లాలోని వేములవాడ అర్బన్ మండలంలోని అగ్ర హారంలో గల ఒక ఆన్‌లైన్‌సెంటర్, సిరిసిల్లలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లను లక్ష్యంగా చేసుకొని మురళి మోసం చేశాడన్నారు. ఈ మేరకు బాధితులు వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ దర్యాప్తులో భాగంగా సాంకేతికత ఆధారంగా ముందుగా నలుగురు వ్యక్తులను గతంలోనే అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపగా పరారీలో ఉన్న దాసరి మురళిని కోరుట్ల వద్ద అరెస్ట్ చేశామ న్నారు. సైబర్ నేరస్థుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన వేములవాడ టౌన్‌సీఐ వీరప్రసాద్, ఎస్‌ఐ రమేశ్, ఆర్‌ఎస్‌ఐ జునైద్, కానిస్టేబుళ్లు ఇమ్రాన్, షమీలను ఎస్పీ అభినందించారు.

వడదెబ్బతో మహిళ మృతి


ఐలమ్మ (ఫైల్)

శంకరపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఉడిగే ఐలమ్మ (55) అనే మహిళ వడదెబ్బతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్లింది. ఎండ తీవ్రతకు వడదెబ్బ తాకడంతో అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యం చేయించారు. సోమవారం తెల్లవారు జామున పరిస్థితి విషమించి మృతి చెందింది.

స్వీట్ హౌస్, బేకరీల్లో తనిఖీలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు స్వీట్‌హౌజ్‌లు, బేకరీల్లో సోమవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని యజమానులకు 9వేల రూపాయల జరిమానా విధించారు. హోటళ్లు, స్వీట్‌హౌజ్‌లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చాట్ బండార్ తదితర షాపుల్లో నిరంతర సోదాలు చేపడుతామని వారుపేర్కొన్నారు. రమాకాంత్, అనిల్, శ్రీనివాస్, ప్రదీప్‌లున్నారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ శ్రీధర్

జైపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన రాటే నగేష్, చౌతకారి శ్రీకాంత్ కాగజ్‌నగర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్లిఅక్కడ గుర్తుతెలియని వ్యక్తులనుంచి 500గ్రాముల గంజాయి కొనుక్కున్నారు. కొంత వారు సేవించి, మిగిలిన గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్‌లుగా చేసి ఒక ప్యాకెట్‌ను రూ.500 విక్రయిస్తున్నారని తెలిపారు. కొంత గంజాయిని విక్రయించి మిగిలిన గంజాయిని రాటేనగేష్‌వద్ద ఉంచినట్లు తెలిపారు. సోమవారం నగేష్, శ్రీకాంత్ గంజాయిని విక్ర యించడానికి రాగా ఇందారం గ్రామంలో ప్లాంటేషన్‌వద్ద ఉండగా పట్టుకున్నామన్నారు. వారివద్దనుంచి 102గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్‌లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఒకరి రిమాండ్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన ఆకుల తిరుపతిని సోమవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. పొత్తూరు మానేరువాగులో గతనెల 31న ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ట్రాక్టర్‌లో ఇసుక నింపుతుండగా రెవెన్యూ అధికారులు దాడిచేశారు. తిరుపతి ట్రాక్టర్ ట్రాలీని అక్కడే వదిలిపెట్టి ఇంజన్ తీసుకొని వెళ్లిపోయాడు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ సురభి సత్యనారాయణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామసమీపంలో సోమవారం తిరుపతిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ సృజన్‌రెడ్డి

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన వీర్ల యాజుష్ దత్త(4) అనే బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. యాజుష్ దత్త సోమవారం ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. దారి తెలియక మానస మటన్ షాపు వద్దకు చేరుకున్నాడు. గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్‌చేశారు. అక్కడే విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ హోంగార్డు నర్సయ్య బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించాడు. అనంతరం బాలుడితో మాట్లాడి చిరునామా గుర్తించిన పోలీసులు క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా హోంగార్డు నర్సయ్యను టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి అభినందించారు.

బతుకుదెరువు కోసం వెళ్లి.. అనంత లోకాలకు

● సౌదీ రోడ్డు ప్రమాదంలో కొత్తపేట వాసి మృతి


రాజేందర్ (ఫైల్)

ఎండపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లి రోడ్డు ప్రమాదంలో ఎండపల్లి మండలం కొత్తపేటకు చెందిన బూట్ల రాజేందర్(40) మృతిచెందాడు. మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం రాజేందర్ మూడు సంవత్సరాల క్రితం సౌదీ వెళ్లాడు. సౌదీలో ఓ హోటల్‌లో పనిచేస్తున్న రాజేందర్ శుక్రవారం పార్సిల్ ఇవ్వడానికి సైకిల్‌పై వెళ్లగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అక్కడి హోటల్ యజమాని సౌదీలో పనిచేసే రాజేందర్ స్నేహితుడికి శనివారం సమాచారం అందించాడు. అతడు మృతుడి భార్య రజితకి సమాచారం ఇవ్వడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య రజిత ప్రభుత్వానికి విన్నవించారు.

ఆటో డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్‌లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి ప్రమాదానికి కారకుడైన సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన గోవిందుల నరేశ్ అనే ఆటో డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 6వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీన్ తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్ సిఐ కె. కృష్ణ వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన ఒగ్గు భూమేశ్ నవంబర్ 23, 2018న రాత్రి 8.15గంటలకు మరమగ్గాల పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై రాజీవ్‌నగర్ నుంచి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో డ్రైవర్ అతివేగంగా నడపుతూ ద్విచక్రవాహనానికి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భూమేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలుచేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ తొమ్మిదిమంది సాక్షులను ప్రవేశపెట్టగా పిపి సందీప్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించి నిందితుడిపై నేరం రుజువు కావడంతో ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ ఆటోడ్రైవర్ నరేశ్‌కు రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.6వేల జరిమానా, బాధితుడికి రూ. 50వేల పరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మోతె సతీష్, మోతె ఎల్లవ్వ, మోతె బాలమణిలపై కేసు నమోదుచేశామని ఎస్సై రమాకాంత్ సోమవారం పేర్కొన్నారు. గ్రామంలోని మోతె కిరణ్, అతని తల్లిదండ్రులు ఎల్లవ్వ, ఎల్లయ్యలు కలిసి జీవిస్తున్నారని తెలిపారు. గతంలో జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకొని ఈనెల 20న సతీష్, ఎల్లవ్వ, బాలమణి కలిసి కిరణ్ కుటుంబ సభ్యులపై దాడికి దిగారని చెప్పారు. కిరణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు తీవ్ర గాయాల పాలయ్యారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో ఏర్పడిన పరిచయంతో అవసరానికి డబ్బులు ఇచ్చి తిరిగి ఇవ్వాలని అడిగితే వేధింపుల కేసునమోదు చేయించి జైలు పాలు చేయడం.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తనను పట్టుకునేందుకు పోలీసులు వెంబడిస్తున్నారనే భయంతో గడ్డి నరేందర్ అనే యువకుడు సోమవారం రాత్రి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధిత కుటుంబసభ్యులు, ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని ఓ మహిళకు గతంలోనే వివాహమైంది. మొదటి భర్త నుంచి దూరంగా ఉంటున్న ఆమెకు ఎల్లారెడ్డిపేటలోని ఓ యువకుడితో పరిచయం ఏర్పడి స్థానికంగా ఓ గదిని అద్దెకు తీసుకుని ఇద్దరు కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో ఆ మహిళకు గల్ఫ్‌లో ఉంటున్న రాచర్లబొప్పాపూర్‌లోని గడ్డి నరేందర్‌తో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడింది. నరేందర్ గల్ఫ్‌లో ఉన్న సమయంలో మహిళకు డబ్బులు పంపించాడు. స్వగ్రామానికి వచ్చిన ఆయన మహిళను డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఆమెతో సహజీవనం సాగిస్తున్న యువకుడు తనతో ఉన్న మహిళను నరేందర్ వేధింపులకు గురి చేస్తున్నాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


కేసు నమోదు చేసిన పోలీసులు నరేందర్‌ను రిమాండ్‌కు తరలించారు. 45రోజుల పాటు జైలు జీవితం గడిపిన ఆయన ఇటీవల విడుదలయ్యాడు. నరేందర్ తండ్రి గడ్డినర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తాను ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని మహిళను కోరడంతో ఆమెతో కలిసి ఉంటున్న యువకుడు తిరిగి నరేందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహిళను వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు అందడంతో ఆందోళనకు గురైన యువకుడు ఎల్లారెడ్డిపేటలో అద్దెకుఉంటున్న మహిళఇంటి సమీ పానికి బైక్‌పై చేరుకుని పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టు పక్కల వారు గమనించి మంటలను ఆర్పి ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మహిళతో పాటు పోలీసులవల్లే తమకొడుకు ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబసభ్యులు ఆరోపించారు.

ఈ విషయంపై స్థానిక ఎస్‌ఐ రమాకాంత్‌ను వివరణకోరగా యువకుడు నరేందర్ మహిళ ఇంటి ఎదుట ఇబ్బందికరంగా వ్యవహరించడం తమకుఅందిన ఫిర్యాదు మేరకు ఇద్దరు పోలీసులు అక్కడకు చేరుకున్నారని తెలిపారు. అప్పటికే యువకుడు అక్కడ నుంచి పారిపోయాడని చెప్పారు. పోలీసులు వెంబడించడం వల్ల భయంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారనే ఆరోపణల్లో వాస్తవం లేదని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



● రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్న ఏఐ టూల్స్

చొప్పదండి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం పెద్దకుర్మపల్లికి చెందిన యువరైతు తిరుపతి వరి సాగు చేశాడు. గత కొద్ది రోజుల క్రిందట వరిలో మెడ విరుపు లక్షణలు కనిపించడంతో వెంటనే చాట్‌జీపీటీలో వరి పొలం ఫోటోను అప్‌లోడ్ చేశాడు. సమస్యకు పరిష్కారం కావాలని అడిగాడు. అంతే క్షణాల్లో చాట్‌జీపీటీలో మెడ విరుపు నివారణకు క్రిమిసంహారక మందులు, వరిలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు, సేంద్రీయ ఎరువులను సూచించింది. వెంటనే తిరుపతి ఎరువుల దుకాణానికి వెళ్లి క్రిమిసంహారక మందులను కొనగోలు చేసి పొలానికి పిచికారి చేశాడు. అతి తక్కువ ఖర్చుతో సమస్య పరిష్కారం అయ్యింది. అందరు రైతుల మాదిరిగా ఎరువుల దుకాణానికి వెళితే మూడు రకాల పురుగుల మందులు ఇస్తారని, ఖర్చు భారం పెరిగిపోతుందని, చాట్ జీపీటీతో తక్కువ ఖర్చులో పొలానికి మందులు దొరికాయని చెబుతున్నాడు యువ రైతు తిరుపతి. వ్యవసాయంలో ఏఐ పరిజ్ఞానం రోజురోజుకు విస్తృతమవుతోంది.



● క్షణాల్లో సమాచారం

నేటి డిజిటల్ యుగంలో ఏఐ(కృత్రిమ మేధస్సు) అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని చూపిస్తుంది. వ్యవసాయంలో చాట్‌జీపీటీ, గూగుల్ జెమిని లాంటి ఏఐ ఆధారిత టూల్స్ రైతులకు క్షణాల్లో సమాచారాన్ని అందిస్తున్నాయి. రైతుల కార్యకలాపాల్లో మార్గదర్శకులుగా నిలుస్తున్నాయి. . రైతులకు పంటల ఎంపికలో సహాయం చేస్తూ భూమి తత్వం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితుల ఆధారంగా వేసుకునే పంటల సమాచారాన్ని అందిస్తున్నాయి. కాలానికి అనుగుణంగా సలహాలు ఇస్తున్నాయి యాప్‌లు.

● తెగుళ్లు, చీడపీడల గుర్తింపు...

రైతులు తమ పొలంలో పంటలకు వచ్చే తెగుళ్లను, చీడపీడలను గుర్తించవచ్చు. పంటల ఫోటోలను చాట్‌జీపీటీ, జెమిని యాప్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే వ్యాధులు, తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులు, నివారణకు చర్యలను సూచిస్తుంది. సేంద్రీయ ఎరువులను కూడా సూచిస్తుంది. వాటిని వాడే విధానాన్ని తెలియ జేస్తుంది. తెలుగు భాషలో స్పష్టంగా వివరాలను అందజేస్తాయి. చాట్ జీపీటీ, గూగుల్ జెమిని లాంటి ఏఐ టూల్స్ రైతులను డిజిటల్ ప్రపంచంలోకి చేర్చడమే కాకుండా సాంకేతికతను, ఆధునిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేస్తున్నాయి.

దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యత

- భూమిపై ఆధిపత్యం కోసం మనిషి విచక్షణరహిత పనులు
- జిల్లాలో అంతరించిపోతున్న అడవులు, గుట్టలు....
- నేడు ధరిత్రి దినోత్సవం



కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. అభివృద్ధి మాటున భూమికి అనేక రకాల విఘాతం కలిగిస్తున్నాం. పరిశ్రమల ద్వారా ఉత్పన్నం అవుతున్న కాలుష్యం, చెట్ల నరికివేత, సహజ నిక్షేపాల వెలికితీత వంటివి భూమిని మరింత కుంగదీస్తున్నాయి. భూమికి కవచంలా ఉన్న ఓజోన్ పొరకు గ్రీన్‌హౌస్ వాయువులు తూట్లు పొడుస్తున్నాయి. పరిశ్రమలు విడుదల చేసే వాయువుల ప్రభావంతో వాతావరణంలో అసమానతలు ఏర్పడుతున్నాయి. మితిమీరిన టెక్నాలజీ వినియోగం ప్రకృతికి చేటుగా మారుతుంది. మనుషులు విచక్షణా రహితంగా చేస్తున్న పనుల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. దీని ఫలితంగా కొన్ని సందర్భాల్లో ప్రకృతి విలయ తాండవం చేస్తూ సునామీలు, అకాలవర్షాలు, పెనుతుఫాన్‌లు, భూకం పాలు చోటుచేసుకుంటున్నాయి. పర్యా వరణాన్ని మనం కాపాడితే అది తిరిగి మనల్ని పరిరక్షిస్తుంది. ప్రకృతికి హాని కలిగించే అనేక కార్యాకలాపాలను వెంటనే నిషేధించాల్సిన అవసరం ఉంది. ఈ హానికారక చర్యలు ఇలాగే కొనసాగితే... భవిష్యత్తు తరాల జీవనం అస్తవ్యస్తం అవుతుంది. భూమి మీద మనిషి మనుగడ ప్రశార్థకంగా మారే అవకాశం ఉంటుంది. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ విషయాన్ని మనందరికీ గుర్తు చెయ్యడానికి ప్రతి ఏడాది ఏప్రిల్ 22న వరల్డ్ ఎర్త్ డే (ధరిత్రి దినోత్సవం) నిర్వహిస్తారు. ఈ రోజునే మదర్ ఎర్త్ డేగా పరిగణిస్తున్నారు.

● జిల్లాలో అంతరిస్తున్న అటవీప్రాంతం

కరీంనగర్ జిల్లాలో 429.772 హెక్టార్ల పరిధిలో ఫారెస్టు విస్తరించి ఉన్నది. కరీంనగర్ ఫారెస్టు డివిజన్‌లో 256.525 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉండగా ఇందులో గంగాధర మండలం వెంకటాయపల్లి, కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వాగు ప్రాంతంలో అటవీప్రాంతం విస్తరించి ఉంది. హుజూరాబాద్ ఫారెస్ట్ డివిజన్‌లో 173.247 హెక్టార్లు ఫారెస్టు ఉండగా రాయికల్ ప్రాంతోలనే అటవీ ప్రాంతం ఉంది. జిల్లా భూమి విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 33 శాతం ఉండాలి. జిల్లాలో 10 శాతంలోపే అటవీ ప్రాంతం ఉంది. రోడ్ల పక్కన, ఇళ్లల్లో, సీటీసీ మియావాకి, ఇతర ప్రాంతాల్లో ఉన్న చెట్లతో కలిపి జిల్లాలో గ్రీన్‌కవర్ 15 శాతం వరకు ఉంది. అటవీ ప్రాంత విస్తీర్ణం తగ్గిపోవటంతోపాటు వన్యప్రాణులకు సహజసిద్ధంగా లభించే ఆహారం దొరకకుండా పోతున్నది. ఇంకో వైపున సహజసిద్ధంగా ఏర్పడిన గుట్టలను తొలచి గ్రానైట్‌ను విదేశాలకు తరలిస్తూ బొందలగడ్డలుగా మారుస్తున్నారు.

● ధరిత్రి దినోత్సవ నేపథ్యం

పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించడమే ధరిత్రి దినోత్సవం ముఖ్యోద్దేశం. మొదట ఐక్యరాజ్యసమితి 1969 మార్చిలో జాన్‌మెకెల్‌తో ఎర్త్ డేను ప్రారంభించింది. ఆ తర్వాత అమెరికా రాజకీయవేత్త గేలార్డ్ నెల్సన్ ప్రారంభించాడు. అమెరికా సెనేటర్ గెలార్డ్ నెల్సన్‌కి వచ్చిన ఆలోచనకు ప్రతిరూపమే ఈ ధరిత్రి దినోత్సవం. అందరికీ ధరిత్రి సంరక్షణపై అవగాహన కల్పించాలని నెల్సన్ నిర్ణయించుకున్నారు. వాతావరణంలో జరిగే మార్పులనూ వివరిస్తూ ఎంత జాగ్రత్తగా ఉండాలో, మన వంతుగా ఏమి చెయ్యాలో అందరికీ తెలియ చెప్పడానికి ఒక రోజంటూ ఉంటే బాగుంటుందని అనుకున్నారు. వెంటనే తన ఆలోచనకు రూపకల్పన చేస్తూ, ఒక వార్తాపత్రిక ద్వారా ప్రజలకూ ధరిత్రి దినోత్సవం గురించి వివరించారు. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఆరోజు అమెరికాలోని ప్రజలంతా ధరిత్రిని రక్షించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రమాణాలు చేశారు. ఇలా అమెరికాలో ప్రారంభమైన ధరిత్రి దినోత్సవం అనంతరం ప్రపంచవ్యాప్తమైంది. ప్రజల్లో మరింత అవగాహన కలిగించేందుకు ఎర్త్ డే నెట్‌వర్క్ ఏర్పడింది. ప్రపంచ ధరిత్రి దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22న జరుపుకుంటారు. పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రి దినోత్సవం నిర్వహించారు.



హరహర మహాదేవ

- భక్తజన సంద్రంగా మారిన వేములవాడ
- భక్తులతో కిక్కిరిసిపోయిన క్యూలు


భక్తులతో కిక్కిరిసిపోయిన రాజన్న ఆలయ ప్రాంగణం


రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు


వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):హరహరమహాదేవా.. శంభో శంకరా.. అంటూ భక్తులు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత పవిత్రమైన సోమవారం రోజున రాజన్నను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో కిక్కిరిసిపోయారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేములవాడకు తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కు క్యూలో భక్తులు గంటలతరబడి నిరీక్షించారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయప్రాంగణం కిక్కిరిసి పోయింది. ఈవోవినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరింటెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరీక్షల నిర్వహణకు సహకరించం


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సుప్మా ఉమ్మడి జిల్లా నాయకులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో త్వరలో నిర్వహించనున్న సెమిస్టర్ పరీక్షలకు సహకరించబోమని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం తేల్చి చెప్పింది. సంఘం ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీ ఉన్నతాధికారులు, పరీక్షల నియంత్రణ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుప్మా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత ఇస్తే తప్ప పరీక్షలు నిర్వహించబోమన్నారు. బకాయిలు విడుదలలో జాప్యంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందని, అధ్యాపకుల వేతనాలు చెల్లించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయించే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పరీక్షల బహిష్కరణ నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శి శ్రీపాద నరేష్, రవీందర్ రెడ్డి, అపూర్వ వేణు, ఇంద్రసేనారెడ్డి రవీందర్ శశాంక్, శ్రీనివాస్, రాజేందర్, కొలనూరు శేఖర్ రెడ్డి, గూగ్గిల జగన్ గౌడ్, ఎన్టీఆర్, భూమేష్, వేణు కుమార్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో బాక్స్ టెలిఫోన్


ఫోన్‌లో మాట్లాడుతున్న విద్యార్థి

చొప్పదండి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్‌లో బాక్స్ టెలిఫోన్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రాజెక్టు మిత్ర పేరుతో రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడేందుకు బాక్స్‌టెలిఫోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా సోమవారం ప్రారంభించారు. ఈఫోన్లు ఏఐ ఆధారంగా పనిచేస్తాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, శ్రీనివాస్, ప్రమోద్ రాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు తీసుకొస్తా

- బ్లాక్ మెయిలింగ్ యూట్యూబర్లతో జర్నలిజానికి చెడ్డ పేరు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్


వేములవాడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

వేములవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఇందుకోసం ఈ ఏడాది కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని, హెల్త్ కార్డులు పనిచేయడం లేదని, డబుల్ బెడ్రూం ఇల్లు కలగానే మారాయన్నారు. ఈ సారి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. కొంతమంది జర్నలిజం అనుభవం లేకున్నా యూట్యూబ్ ఛానళ్ల ముసుగులో ఇష్టానుసారం వ్యక్తిగత దూషణలు చేస్తూ కుటుంబాలపై బురద చల్లుతూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బ్లాక్‌మెయిలింగ్ యూట్యూబర్లతో జర్నలిజానికి చెడ్డపేరు వస్తోందన్నారు. జర్నలిస్టు సంఘాలు, ప్రెస్‌క్లబ్ నిర్వాహకులు ఈవిషయంలో కఠినంగా ఉండాలని కోరారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ సమాజ హితం కోసం పనిచేసే యూట్యూబ్ ఛానళ్లను ఖచ్చితంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈవిషయంపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో త్వరలోనే సైనిక్ స్కూల్ ఏర్పాటు అయ్యేందుకు కృషి చేస్తానని అన్నారు. వేములవాడ ప్రెస్‌క్లబ్ భవనానికి గతంలో పది లక్షల రూపాయలు కేటాయించానని, త్వరలో మరిన్ని నిధులు కేటాయిస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్, బిజేయూ జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం రాలేదని పనులు అడ్డుకున్న రైతు

● రైతుపై దాడి చేసిన సైట్ ఇంజనీర్


దాడిలో చినిగిపోయిన చొక్కాతో మచ్చయ్య

శంకరపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో జాతీయ రహదారి విస్తరణ పనులను ఓ రైతు అడ్డుకోవడంతో సైట్ ఇంజనీర్ రైతుపై దాడిచేశాడు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు కాసు మచ్చయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు శివారులో కాసు కొంరయ్య, కాసు మచ్చయ్య అన్నదమ్ములకు వ్యవసాయ బావి ఉంది. వ్యవసాయ బావి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పోయింది. బావికి పరిహారం అందకపోవడంతో రైతు మచ్చయ్య రహదారి విస్తరణ పనులను అడ్డుకున్నాడు. అక్కడికి చేరుకున్న సైట్ ఇంజనీర్‌కు, మచ్చయ్యకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో సైట్ ఇంజనీర్ మచ్చయ్యపై దాడి చేసి నెట్టి వేయడంతో బావి పక్కకు పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. తనను దూషించి దాడిచేశారని సైట్ ఇంజనీర్‌పై మచ్చయ్య కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

టెక్నాలజీ ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలి

● తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ వి బాలకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వి బాలకృష్ణారెడ్డి

గంబీరావుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా టెక్నాలజీని ఉపయోగించుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గంబీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ సెమినార్‌లో భాగంగా జనరేటివ్ ఏఐపై జాతీయ సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ వి బాలకృష్ణారెడ్డి మాట్లాడారు. ఎన్ఈపీకి అనుగుణంగా ఐసీటీలో ఏ1టెక్నాలజీని ఉపయోగించు కుని మారుమూల గ్రామాలలోని కళాశాలలను పట్టణకళాశాలల ధీటుగా అభివృద్ధి చేయవచ్చన్నారు. ఎలమంచి ప్రాజెక్ట్ హ్యాండ్లింగ్ గురించి ఐడియా జనరేషన్ రీసెర్చ్ మెథడాలజీ ఏఐద్వారా భవిష్యత్‌కు తగిన విద్యార్థులను తయారు చేయవచ్చని అన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు పరిశోధన నైతిక విలువలతో పాటు జ్ఞానం పెంపొందించుకోవచ్చని అన్నారు. డాక్టర్ కల్యాణి మాట్లాడుతూ విద్యార్థులు లిటరేచర్ రివ్యూ రీసెర్చ్ మెథడాలజీలో ఎలా చేయాలో వివరించారు. డాక్టర్ స్వాతి లాంగ్వేంజ్ ఏఐ టూల్స్ గురించి వివరించారు. హంట్ మెట్రిక్ సీఈవో అయూబ్ షేక్ పిల్లల అసైన్‌మెంట్, అంటెండెన్స్, ఎక్సర్‌సైజ్, వాల్యూయేషన్ ఏఐ టూల్స్ ఉపయోగించి ఎలా చేయాలో వివరించారు. సెమినార్ అర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్రావణ్‌కుమార్, వివిధ కళాశాలల పరిశోధకులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలి

● నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్


మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్ గ్రామంలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ కంటే అధ్వానంగా రేవంత్ సర్కార్ పాలన చేస్తోందని విమర్శించారు. రైతులను ఆదుకోవడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అర్హులందరికీ రైతు భరోసా, రుణమాఫీ కాక ఇప్పటికే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం దౌర్భాగ్యమన్నారు. విపత్తులు సంభవించినప్పుడు ఫసల్‌బీమా రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీ తెలిపారు. గతంలో కేసీఆర్, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు దోచుకునుడే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన ఆరోపించారు. పాలన చేతకాకనే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అప్పులు ఉన్నాయని ఆరోపిస్తున్నాడని అర్వింద్ విమర్శించారు. కోరుట్ల నియోజకవర్గంలో వడగండ్ల వాన తీవ్ర నష్టం మిగిల్చిందన్నారు. 20వేల ఎకరాలు పంటనష్టం జరిగిందన్నారు. 60 శాతం ఇబ్రహీంపట్నం మండలంలో నష్టం వాటిల్లిందని తెలిపారు. పంటనష్టంపై జిల్లాకలెక్టర్‌కు, వ్యవసాయ శాఖ మంత్రికి లేఖలు రాస్తామన్నారు. అధికారులు పంట నష్టం సర్వే నిర్వహించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, బీజేపీ రాష్ట్రనాయకులు డా.రఘు, బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి, నాయకులు చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, బొడ్ల రమేష్, సుంచు రణధీర్, బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కార్మికులకు పనిగంటల పెంపు

- లేబర్‌కోడ్‌లతో కార్మికులను బానిసలుగా మార్చేందుకు కుట్ర
- మే డేను విజయవంతం చేయాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు


సిరిసిల్లలో మేడే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 21 (అంధ్రజ్యోతి): దేశంలో బీజేపీపాలిత రాష్ట్రాల్లో కార్మికులకు పనిగంటల పెంపు, లేబర్‌కోడ్‌లతో కార్మికులను బానిసలు మార్చేందుకు కుట్రలు పన్నుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో సోమవారం మేడే సందర్భంగా సీపీఎం అధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను సీపీఎం నాయకులతోకలిసి రాష్ట్రకమిటీసభ్యుడు స్కైలాబ్‌బాబు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేస్తు నాలుగులేబర్‌కోడ్‌లను తీసుకరావటమే కాకుండా కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ విధానాలపై కార్మికుల ఉద్యమాలను చేపట్టాలని మేడే సందర్భంగా అంతర్జాతీయ శ్రామికదినోత్సవాన్ని గ్రామాలతోపాటు అన్ని వార్డులల్లో ఎర్రజెండాలను ఎగురవేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక చట్టాల సవరణ ద్వారా కార్మికులను యజమానులకు పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే కుట్ర జరుగుతుందన్నారు. కార్మిక చట్టాలను సవరణ చేస్తే 8 గంటల స్థానంలో 12గంటల పనిదినాలు అమలు అవుతాయని అన్నారు కార్మికులపై పనిగంటలు పెంచి పెట్టుబడిదారులకు ఆదాయాన్ని సమకూర్చడానికి కేంద్ర మే లేబర్‌కోడ్‌లను తీసుకొస్తున్నదని విమర్శించారు. కార్మికవర్గం కార్మిక చట్టాల సవరణపై తిరగబడకపోతే కార్మికులు యజమానులు పెట్టుబడిదారులకు బానిసలుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. మే 1న అంతర్జాతీయ కార్మిక కష్టజీవుల దినోత్సవాన్ని గ్రామ గ్రామాన వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ అధ్యక్షత వహించగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి. జవ్వాజి విమల, కోడం రమణ మల్లారపు అరుణ్ కుమార్ జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య అన్నల్దాస్ గణేష్ సూరం పద్మ రమేష్ చంద్ర వివిధ ప్రజా సంఘాల నాయకులు రామంచ అశోక్ సిరిమల్లె సత్యం. కుమ్మరి కుంట కిషన్‌నరేందర్ ఎస్ రాములు దినకర్ నక్క దేవదాస్ సురేష్ కమలాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలాఖరులోగా స్ర్కీనింగ్ టెస్ట్‌లు పూర్తి చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గంగాధర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళలో భాగంగా మహిళలందరికీ మే నెలాఖరు వరకు స్ర్కీనింగ్ టెస్ట్‌లు పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం గర్షకుర్తి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక రక్తపోటు, డయాబెటిక్ పేషెంట్స్‌కు సంబంధించి రికార్డులు మెయింటెన్ చేయాలన్నారు. తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలను జిల్లా పోషకాహార పునరావాస కేంద్రానికి పంపించాలని సూచించారు. అంతకు ముందు జిల్లా వైద్యాధికారి వెంకట రమణ మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషన్ ఆదేశాల మేరకు పిల్లలకు వ్యాక్సిన్ వేయడానికి జిల్లా వ్యాప్తంగా ఇమ్యూనైజేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. వలస ప్రాంతాలు, కార్మికుల కాలనీలు, నిర్మాణ ప్రదేశాలు, తాత్కాలిక నివాసాలలో తప్పిపోయిన పిల్లలను గుర్తించి టీకాలు వేస్తామన్నారు. రొటీన్ ఇమ్యూనైజేషన్‌లో ఏడు రోజుల చొప్పున ఏప్రిల్, మే, జూన్‌లో మూడు రౌండ్లలో నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి రౌండ్ ఏప్రిల్ 21నుంచి 28, రెండో రౌండ్ మే 21నుంచి 28, మూడో రౌండ్ జూన్ 23 నుంచి 30 వరకు ఉంటాయని తెలిపారు. ఎస్‌హెచ్‌ఎం డీపీవో స్వామి, గంగాధర వైద్యాధికారి శ్వేత, ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి జీవన నైపుణ్యం తప్పనిసరి

కరీంనగర్ టౌన్: ప్రతీ విద్యార్థికి జీవన నైపుణ్యం తప్పనిసరని, అప్పుడే వారు భవిష్యత్‌లో వివిధ రంగాల్లో రాణిస్తారని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జాన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యం, సవాళ్లు, స్థిరత్వం కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థులతో విటమిన్ గార్డెన్ ఏర్పాటు చేసి మార్కెటింగ్ చేయించామన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఫౌండేషన్ చైర్మన్ సురేందర్, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, క్వాలిటీ కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అవీ..ఇవీ

కరీంనగర్ అర్బన్: నామినేటెడ్ పదవుల కేటాయింపులో మైనార్టీలకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ కోరారు. గాంధీభవన్‌లో సోమవారం మైనార్టీ సెల్ రాష్ట్ర ఇన్‌చార్జి షకీల్ నవాజ్‌తో 33 జిల్లాల సమావేశం నిర్వహించగా తాజొద్దీన్ హాజరయ్యారు. అంతకుముందు మైనార్టీ సెల్ రాష్ట్ర ఇన్‌చార్జి షకీల్ నవాజ్‌ను సన్మానించారు.

కరీంనగర్ కల్చరల్: స్థానిక సరస్వతీ శిశు మందిర్ పాఠశాల గ్రంథాలయానికి సోమవారం పసుల తార-యాదగిరి 34 వేల 79 రూపాయల విలువ గల పుస్తకాలను అందజేశారు. పాఠశాల అధ్యక్ష కార్యదర్శులు బల్మూరి కరుణాకర్ రావు, కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూర్‌లో సోమవారం కూరగాయాల మార్కెటింగ్ డే నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పెంచిన ఆకు కూరలను, వివిధ రకాల కూరగాయలను విద్యార్థులు విక్రయించారు. ఎండీపీవో సంజీవరావు విద్యార్థులను అభినందించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వర్క్ సైట్ పిల్లల భోజనానికి ప్లేట్లు, స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. ఎంఈవో రవీందర్, ప్రధానోపాధ్యాయులు పద్మ, భాగ్య, భారతి పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలోని ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ సోమ నర్సయ్య ఆధ్వర్యంలో జాతీయ సివిల్ సర్వీసెస్ డే నిర్వాహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాలలో ఉపాధిహామి కూలీ పనులకు వెళ్లే కూలీలకు జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాల యోగా శిక్షకుడు వావిలాల కిష్టయ్య యోగా శిక్షణను అందిస్తున్నారు. ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తున్నారు.

ఎండలకు అల్లాడుతున్న మూగజీవాలు

(5వ పేజీ తరువాయి)

కృష్ణజింకలు, మనుబోతు, కుందేలు వంటి జంతువులతోపాటు నెమలి, రామచిలుక, పావురాలు, లవ్ బర్డ్స్ బాతులు, కంజులు, అడవి కోడి, చీమ కోడి, అమెరికా హెన్, టర్కీకోడి, ఈముబర్డ్, వంటి పక్షులకు షెడ్లు నిర్మించారు. వాటిపైన చల్లదనం కోసం తడకలను, ప్రత్యేక గడ్డిని అమర్చారు. షెడ్ల ముందు భాగంలో గోనె సంచులను ఏర్పాటు చేశారు.

● ఆహారం తగ్గించిన పక్షులు, జంతువులు

డీర్‌పార్క్‌లోని విదేశీ పక్షులు, జంతువులు పెరిగిన ఉష్ణోగ్ర తలకు అల్లాడిపోతున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, టర్కీలో చల్లటి ప్రదేశాల్లో ఉండే హమ్‌స్టార్, ఈము పక్షి, టర్కీ కోడి, అమెరికా హెన్ వంటివి ప్రస్తుతం ఇక్కడి వేడికి తట్టుకోలేక ఆహారం తీసుకోవడం తగ్గించాయి. దీంతో డీర్‌పార్క్ అధికారులు, డాక్టర్లు ప్రత్యేక చర్యలతో వాటికి చల్లటి వాతావరణం కల్పించే చర్యలు తీసుకుంటూ వాటిని సంరక్షిస్తున్నారు.

● స్ప్రింక్లర్లతో చల్లదనం

ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూడుసార్లు షెడ్‌లపై తడకలను స్ప్రింక్లర్ల ద్వారా నీటితో తడిపి చల్లబరుస్తున్నారు. దీంతో ఎండ వేడి నుంచి పక్షులు, జంతువులకు కొంత మేర ఉపశమనం లభిస్తున్నది. హైదరాబాద్ వంటి పెద్ద పార్క్‌ల్లో జంతువులు, పక్షుల కోసం అధికారులు కూలర్లను ఏర్పాటు చేశారు. కరీంనగర్ డీర్‌పార్క్‌కు ఆ స్థాయిలో నిర్వహణ సామర్థ్యం లేకపోవడంతో అందుబాటులో ఉన్న మేరకు రక్షణ చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. కరీంనగర్ డీర్ పార్క్‌ను నెలకు 11 వేల మంది సందర్శిస్తున్నారు. వేసవి కాలం, సెలవుల్లో ఈ సంఖ్య కొద్దిగా పెరుగుతుంది. సందర్శకుల వద్ద వసూలు చేసి చార్జిలతో డీర్‌పార్క్‌కు నెలకు 3 నుంచి 5 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. డీర్‌పార్క్‌లో ముగ్గురు అధికారులు, 17 మంది సిబ్బంది పని చేస్తున్నారు.

పక్షులు, జంతువుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం

- ఆనంద్‌కుమార్, డీర్‌పార్క్ ఇన్‌చార్జి, ఫారెస్టు డిప్యూటీ రేంజి ఆఫీసర్

డీర్‌పార్క్‌లో ఉన్న జంతువులు, పక్షుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుని రోజుకు మూడుసార్లు షెడ్లపై నీటిని చల్లుతున్నాం. విదేశీ పక్షులు, జంతువులు పెరిగిన ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్నాయి. వైద్యుల సలహాలు, సూచనలతో రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. వేసవి కాలంలో విద్యాసంస్థలకు సెలవులు కావడంతో సందర్శకుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల్లో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏడీఈ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11 వరకు క్రిస్టియన్ కాలనీ చర్చి, విజయమోహన్ రెడ్డి ఆస్పత్రి, సవరన్ వీధి, సివిల్ ఆస్పత్రి వెనక ప్రాంతం, రెడ్డి నివాసం, రామ్‌రాజ్ కాటన్ షాపు ఏరియాలోనూ, ఉదయం 8గంటల నుంచి 10 వరకు ఆదర్శనగర్, అరుణోదయ ఫైనాన్స్, మంచిర్యాల చౌరస్తా, రెనీ హాస్పిటల్, వావిలాల రాంరెడ్డి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : హోంగార్డులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం ప్రతి నిధులు కోరారు. సోమవారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ కుమార్‌ను వినతిపత్రం అందజేశారు. హోంగార్డులు వాలంటరీ వ్యవస్థ ద్వారా శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సేవలందించినట్లు గుర్తు చేశారు. హోంగార్డుల చట్టంలో మార్పులు తీసుకొచ్చి ఆదుకోవాలని కోరారు. 2016 నుంచి నిలిపివేసిన కారుణ్య నియామకాలను పునరుద్ధరించాలన్నారు.

అధ్యయనం ద్వారా సృజనాత్మకత



పుస్తకాలను అందజేస్తున్న వారాల ఆనంద్

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అధ్యయనం ద్వారానే సృజనాత్మకతను పొందుతారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ అన్నారు. సోమవారం నగునూరులో సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సృజనతో భావాల్ని వ్యక్తం చేయవచ్చని, రాయడంతోపాటు చదవడం ముఖ్యమని అన్నారు. అనంతరం ఆనంద్ తాను రాసిన పుస్తకాలను కళాశాల లైబ్రెరీకి అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాలతి పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని దారం సుశీల ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ డి.రఘురామన్ అన్నారు. సోమవారం యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్య సాధనకు పాఠశాలస్థాయి నుంచి క్రమ శిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి రఘునందన్‌రావు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ లోగో ఆవిష్కరణ

భగత్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటినంబరు, వీధి బోర్డు పేర్ల స్వచ్ఛ భారత్ లోగోను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిప్పారపు రవివర్మ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎడబోయిన రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

గణేశ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పోషణ పక్షం సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలో సిరి, మల్లికార్జున పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, కరివేపాకు, మునగాకు వంటివి నిత్యం ఆహారంలో తీసుకోవాలన్నారు. డీఎంసీ శ్రీవాణి పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు సంతోష్‌నగర్ సెక్టార్‌లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్, మెప్మా ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ మాట్లాడుతూ పిల్లలు వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేకపోతే కలిగే నష్టాలను వివరించారు. పోషణలోపం ఉన్న పిల్లలను న్యూట్రిషన్ రీ హాబిటేషన్ సెంటర్‌లో చేర్పించాలన్నారు. గర్భిణులు సాధారణ డెలివరీ కోసం ప్రయత్నం చేయాలని, పుట్టిన గంటలోపు శిశువులకు ముర్రుపాలు తాగించాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాల వాకర్స్ కార్యవర్గం

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొట్టిముక్కుల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా చింతికింది శ్రీనివాస్, కోశాధికారిగా మల్కాపురం రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఐరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చింతనేని మోహన్‌రావు, ప్రధాన సలహాదారుగా గంద మహేష్, చీటినేని ప్రదీప్‌రావు, అన్నమనేని సుధాకర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా అశోక్‌రావు, లీగల్ అడ్వైజర్‌గా శ్రీనివాస్‌రెడ్డి, ఈవెంట్ ట్రెజరర్‌గా దామోదరాచారి ఎన్నికయ్యారు. మాజీ మేయర్ సునీల్‌రావు, ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ 303 గవర్నర్ కూరాకుల భారతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీమ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదానం, పండ్ల పంపిణీ చేపట్టారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి అమీర్ అజ్జు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫాహద్, గుర్రం వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీకాంత్, విష్ణు, కరీంనగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు అఖిల్ నాయకులు పాల్గొన్నారు.

డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, అర్బన్ బ్యాంక్ చైర్మన్ విలాస్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ నెల 22వ తేదీ నుంచి 30 వరకు లబ్ధిదారుల ధ్రువీకరించనున్నారు. వచ్చే నెల 2వ తేదీన పంచాయతీల్లో లబ్ధిదారుల జాబితా విడుదల చేయనున్నారు. 3 నుంచి 5వ వరకు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు ఎంపీడీవో సంజీవరావు తెలిపారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన ఎబ్బోజు భార్గవ్(28) మంగళవారం కొత్తపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. తల్లిదండ్రులు చనిపోవడంతో భార్గవ్ ఒంటరిగా ఉంటున్నాడు. మద్యానికి బానిసగా మారాడు. ఇళ్లు లేకపోవడంతో రోడ్ల పక్కనే ఉండేవాడు. ఈ క్రమంలో చెడు అలవాట్లకు బానిసగా మారిన భార్గవ్ జీవితంపై విరక్తితో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్గవ్ బావ శంకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్‌లో తెలుగు రద్దు ఆలోచన విరమించుకోవాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న తెరవే సభ్యులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటర్మీడియెట్‌లో తెలుగును రద్దు చేసే యోచనను విరమించుకోవాలని తెలంగాణ రచయితల వేదిక ప్రతినిధి బృందం కోరింది. సోమవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులను మాతృభాష తెలుగుకు దూరం చేయనున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. తెరవే బాధ్యులు బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, సీవీ కుమార్, కూకట్ల తిరుపతి, దామరకుంట శంకరయ్య, నడిమెట్ల రామయ్య, రామానుజం సుజాత, పత్తెం వసంత, సిరిపురం వాణిశ్రీ, నసీరుద్దీన్, ఖాలిద్, విలాసాగరం రవీందర్, పెనుగొండ బసవేశ్వర్, గుండు రయణయ్య, యుగంధర్, విజయశ్రీ, జలంధర్‌రెడ్డి, కొమురయ్య, చైతన్య పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సీవోఈ విద్యార్థుల ప్రతిభ



శివకుమార్ శర్వాణి అభిలాష్ స్వేచ్ఛ ప్రజ్ఞ స్పందన

తిమ్మాపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల సాంఘికసంక్షేమ గురుకుల ప్రతిభకేంద్రం (సీవోఈ- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్- 2025లో ప్రతిభను కనబరిచి అద్భుతఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కె శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందులో పిశివకుమార్ (92.71)పర్సంటైల్, జి.శర్వాని(90.15), ఈ అభిలాష్(90.09), ఈ స్వేచ్ఛ ప్రజ్ఞ(86.70), ఏ స్పందన (86.28)పర్సెంటైల్ సాధించినట్లు తెలిపారు. మొత్తం 78మంది విద్యార్థులకుగాను 37మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. 90పర్సంటైల్‌తోపాటు ఆపైన ముగ్గురు విద్యార్థులు, 80కిపైగా 13మంది విద్యార్థులు, 70 పర్సంటైల్‌కి పైగా 24మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. గణితంలో 98.29, ఫిజిక్స్‌లో 91.73, కెమిస్ట్రీలో 91.99అత్యధిక పర్సంటైల్‌ను సాధించారని తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభకనబరిచిన విద్యార్థులను సాంఘిక గురుకుల కార్యదర్శి అళగువర్షిణి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎంఈవో

శంకరపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను ట్విన్నింగ్ ఆఫ్‌స్కూల్ కార్యక్రమంలో భాగంగా ఎంపీయుపీఎస్ లింగాపూర్, ఆముదాలపల్లి, రాజాపూర్, కాచాపూర్ విద్యార్థులతో కలిసి ఎంఈవో లక్ష్మీనారాయణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లోని ప్రత్యేకతలు, తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాబోధన నుంచి మొదలు కొని పాఠశాలలో ఉన్న వసతులు చూసి సంతోషించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజు, కనకలక్ష్మి, మహేందర్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలి

● జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్

చొప్పదండి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీపీఐ బలోపేతం కోసం ప్రతికార్యకర్త కృషిచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమ వారం మండలంలోని రుక్మాపూర్‌లో సీపీఐ గ్రామశాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిగ్రామంలో సీపీఐ బలోపేతం కోసం కృషిచేయాలన్నారు. ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని కలగించాలని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, నాయకులు లంక అజయ్, శ్రీనివాస్, పవన్, సిద్ధార్థ, రాజయ్య, కనకం వంశీ, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన సతీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ధర్మారం ఎస్‌బీఐ బ్రాంచ్‌లో సేవింగ్ ఖాతా ఉన్న సతీష్ వెయ్యి రూపాయలతో యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ తీసుకున్నాడు. మేనేజర్ గౌతమ్‌రెడ్డి చేతుల మీదుగా రూ.20లక్షల బీమా చెక్కును సతీష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

చొప్పదండి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతఇస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం అన్నారు. సోమవారం మండలంలోని రుక్మాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 3కోట్ల25లక్షలతో అదనపుతరగతి గదులు, ప్రయోగశాలల నిర్మాణానికి ఆయన శంకుస్థాపనన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపాఠశాలలో కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దామన్నారు. దేశంలోనే రాష్ట్రంలో విద్యారంగానికి అత్యధికనిధులు కేటాయిస్తున్నామన్నారు. డైట్ చార్జీలుపెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, అధికారులు, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులుపాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రోడ్డు వెడల్పు చేపట్టాలి



ఆందోళన చేస్తున్న ప్రజలు

గంగాధర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు వెడల్పు చేపట్టాలని కురిక్యాలలో నాలుగు గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తంచేశారు. గంగాధర మండలం కురిక్యాల నుంచి కరీంనగర్ మండలం ఆసిఫ్‌నగర్ వరకు డబుల్‌రోడ్డు పనులు చేపడుతున్నారు. అయితే గర్షకుర్తి, ఉప్పరమల్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి గ్రామాల్లో డబుల్‌రోడ్డు చేపట్టి కురిక్యాలలో ఇళ్ల మధ్య రోడ్డు ఇరుకుగా నిర్మిస్తున్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతాయని నాలుగు గ్రామాల ప్రజలు కురిక్యాలలో నిరసన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. అంతటా ఒకే విధంగా రోడ్డు నిర్మించాలని అధికారులను కోరారు.

రూ.7650 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్‌పత్తి ధర రూ.7650 పలికింది. సోమవారంమార్కెట్‌యార్డుకు ఆరుగురు రైతులు 74క్వింటాళ్ల విడిపత్తి, ఇద్దరు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7650, కనిష్ఠ ధర రూ.5500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గాలులకు కూలిన ఇంటి పైకప్పు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికిచెందిన గుండేటి సరిత ఇంటి పైకప్పు ఆదివారం సాయంత్రం ఈదురుగాలులకు కూలిపోయింది. బాధితురాలిని ఆదుకోవాలని స్థానికకాంగ్రెస్ నాయకులు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కొల్లూరి కిరణ్, మండల మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు రాధ, ఉమాపతిరావు, ఎండి చాంద్‌పాషా, బండారి సదానందం, సంపత్, రాజు, పోషు రాజమౌళి, రవి, ఓదెలు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

హుజూరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరివాడకు చెందిన గన్నారపు సంధ్య అనే అంగన్‌వాడీ టీచర్ మృతిచెందగా సోమవారం మృతురాలి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా సంధ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో మే5నుంచి వస్త్ర చిత్ర కళా ఉద్యమీ(మగ్గంవర్క్), మే8నుంచి టైలరింగ్‌లో మహిళలకు 31రోజులపాటు ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ ఒకప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లాకుచెందిన గ్రామీణ ప్రాంతానికి చెందిఉండి ఆసక్తిగలమహిళలు నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్నివివరాలకు 9849411002, 7981151653 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముందస్తు బడిబాట

రామడుగు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రారం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆధ్వర్యంలో ముందస్తు బడిబాటకార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పిల్లలనుపాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గన్నేరువరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వరికోతలు జోరుగా సాగుతుండడంతో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు భారీగా తరలిస్తున్నారు. దీంతో అధికారులు ముమ్మరంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. మండలంలోని ఖాసింపేట, పారువెల్ల యాశ్వాడ, సాంబయపల్లి, చాకలివానిపల్లి, చీమలకుంటపల్లి గ్రామాలలో ఐకెపి, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఉమ్మడి బెజ్జంకి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, ఐకెపి ఏపీఎం లావణ్య, నాయకులు, సెంటర్ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ఇందిరాక్రాంతి పథకం ద్వారా నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ న్యాదండ్ల రాజ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇల్లందకుంట దేవస్థానం డైరెక్టర్ తిరుపతి రెడ్డి, మాజీసర్పంచ్ వీరమల్ల రవిందర్‌రెడ్డి, వీవో అధ్యక్షురాలు సుజాత, సీసీలు దేవేం దర్, శ్రీనివాస్‌రెడ్డి మల్లయ్య పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు

రామడుగు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ సామాజికతనిఖీ గ్రామసభలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వెదిర, వెలిచాల, పందికుం టపల్లి, చిప్పకుర్తి, కొరటపల్లి, గుండి, తిర్మలాపూర్, శ్రీరాములపల్లి, కొక్కెరకుంట, రుద్రారం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అక్కడ చేపట్టిన పనుల వివరాలు చదువుతూ ప్రజల నుంచి వివరాలు సేకరించారు. అలాగే 23న గోపాల్‌రావుపేటలో, 24న దేశరాజుపల్లి, రామడుగు, షానగర్, కిష్టాపూర్, మోతె, రంగసాయిపల్లి, లక్ష్మీపూర్‌గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మానకొండూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఫాతిమానగర్ అడోరేషన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ ప్రీత అన్నారు. మండలంలోని పచ్చునూర్‌లో సోమవారం ఫాతిమా అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమెప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడి ఇష్టంతో కుట్టు శిక్షణను నేర్చుకొని పలువురికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. సంస్థ ప్రతినిదులు మర్రి మల్లేశం, నరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రూప రమేశ్, స్రవంతి, మౌనిక, శ్రీవాణి, సరిత, 100 మంది మహిళలు ఉన్నారు.



పచ్చునూర్‌లో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిస్టర్ ప్రీత